క్లుప్తంగా

వస్తున్న మార్పులపై పట్టు సాధించాలి


మాట్లాడుతున్న సురేష్‌బాబు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రసాయన శాస్త్ర విద్యార్థులు వారివారి రంగాల్లో వస్తున్న మార్పులపై పట్టు సాధించాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ సురేష్‌బాబు అన్నారు. కేబీఎస్ కళాశాల పీజీ రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యాన గురువారం 'సహజ ఉత్పత్తుల ద్వారా ఔషధ ఆవిష్కరణలు' అంశంపై సదస్సును ఆ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించారు. డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ సహజ వనరుల నుంచి ఉద్భవించిన బయో యాక్టివ్ సమ్మేళనాలు, ఫైటోకెమికల్ విశ్లేషణ ఔషధ పరిశోధనలో చాలా కీలకమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ వస్తున్న మార్పులను విద్యార్థులకు తెలియజేయడానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు విభాగాధిపతి డాక్టర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కలిగి ఉన్న ఇద్దరి అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గంజాయి కలిగి ఉన్న ఇద్దరు యువకులను కొత్తపేట పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి అరకిలోకి పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట సెక్టార్ ఎస్ఐ షబ్బీర్ అహ్మద్ పాత రాజరాజేశ్వరిపేటలో గస్తీ నిర్వహిస్తుండగా ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. ఎస్ఐ షబ్బీర్ అహ్మద్ ఆ ఇద్దరు యువకులను ఆరా తీయగా పొంతన లేని సమాధానం ఇచ్చారు. వారిని తనిఖీ చేయగా వారి వద్ద చేతి సంచిలో పొట్లాలు కనిపించాయి. దీంతో యువకుల వివరాలను అడగగా పాత రాజరాజేశ్వరిపేటకు చెందిన పిల్లా మోహనరావు(25), సయ్యద్ సర్వర్ అలియాస్ బూడీ(24)గా గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

కబడ్డీ సంఘ వివాదం సమసిపోలేదు

సంఘ కార్యదర్శి వీర్లంకయ్య

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ రిజిస్ట్రేషన్‌పై కోర్టులో వాదనలు జరుగుతున్నాయని, సంఘ వివాదం సమసిపోలేదని ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వీర్లంకయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంఘ రిజిష్టర్ నెంబర్ 115/2010పై హై కోర్టులో రెండు పిటిషన్లు తాము దాఖలు చేశామని తెలిపారు. వీటిలో రిట్‌పిటిషన్ 16899/2019 కేసును తామే విత్‌డ్రా చేసుకున్నామని, 924/2021పై వాదోపవాదనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు తమ సంఘానికే ఉందని తెలిపారు. కబడ్డీ సంఘం తమదేనని కొందరు వ్యక్తులు చేస్తున్న అసత్య ప్రచారాలు నమ్మొద్దని పేర్కొన్నారు.

మత్తుకు బానిసలు కావొద్దు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని, ఏపీని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దడానికి విద్యార్థులు కృషి చేయాలని భవానీపురం పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎండీ ఉమర్ అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై ఆయన గొల్లపూడి బైపాస్ రోడ్‌లోని నలంద డిగ్రీ కళాశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు స్నేహాల కారణంగా డ్రగ్స్, మద్యం అలవాటు చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో నలంద డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఉమా, అధ్యాపకులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సాహిబ్ ఇన్‌స్టిట్యూషన్ వ్యవస్థాపకులు మొహమ్మద్ యాకూబ్ అలీషాను పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం భవానీపురంలోని జమియ యాకూబియా నూరియ అరబిక్ మదర్సాను మొహమ్మద్ వాజిద్ ఆలీషా యాకూబి తో కలిసి మొహమ్మద్ యాకూబ్ ఆలీషా సందర్శించారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ చైతన్యరెడ్డి, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ వాజిత్ ఖాన్, కార్పొరేటర్లు ఆంజనేయ రెడ్డి, ఇర్ఫాన్, దేవిరెడ్డి అంజనేయ రెడ్డి, మెహమూద్ పాల్గొన్నారు.

నేడు 38వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం 38వ డివిజన్ విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ హైస్కూల్ నుంచి ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించనున్నారని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది. పర్యటన అనంతరం 10 గంటలకు గుప్తా సెంటర్‌లోని దర్గా వద్ద మీడియాతో మాట్లాడనున్నారు.

సంక్షేమ పథకాలతో సంతృప్తి

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు


సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్ అందజేసిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

వించిపేట(విజయవాడపశ్చిమ): గడప గడపకు అందుతున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తి చెందుతున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పలు శాఖల అధికారులతో కలసి ఆయన 49వ డివిజన్ 167వ సచివాలయ పరిధిలోని కొండ ప్రాంతంలో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి గడచిన మూడున్నరేళ్లుగా ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాల అమలుపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పలువురు స్థానికులు ఆ ప్రాంతంలో ఎదురవుతున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అర్హతే కొలమానంగా తమ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. ప్రతి పేదవాడికి సొంతిల్లు కట్టించి ఇవ్వడమే జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని, ఆ దిశగా పేదలకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. గత టీడీపీ హయాంలో కేవలం జన్మభూమి కమిటీ సభ్యులకు తప్ప సాధారణ ప్రజలకు ఏఒక్క మేలు చేసింది లేదన్నారు. 49వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్‌గా పోటీ చేసిన అభ్యర్థి నీలం వెంకటనారాయణ ఆయన సోదరుని కుటుంబ సభ్యులు కూడా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో దాదాపుగా అన్ని సంక్షేమ పథకాలు పొందడమే దానికి నిదర్శనమన్నారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు కొండ ప్రాంతంలోని చిట్ట చివరి ఇంటి వరకు వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని, దాన్ని చూసి ఓర్వలేక టీడీపీ, జనసేన నాయకులు అక్కసుతో విమర్శలకు దిగడం సరికాదని హితవు పలికారు. వారు ఎన్ని కుయుక్తులకు దిగినా ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డి వైపే ఉన్నారని, వారే బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు చేపూరి శ్రీనివాసరావు, బూదాల శ్రీనివాసరావు, ఎర్రజొన్న విజయలక్ష్మి, తంగిరాల ప్రమీల, పూనూరి జార్జి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలి

జిల్లా పరిశ్రమల కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ నరేంద్రబాబు


మాట్లాడుతున్న కె.నరేంద్రబాబు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ప్రభుత్వ ప్రోత్సాహకాలను యువత వినియోగించుకోవాలని జిల్లా పరిశ్రమ కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ కె.నరేంద్రబాబు చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్‌లో గురువారం పరిశ్రమల స్థాపనపై యువతకు అవగాహన సదస్సు జరిగింది. నరేంద్రబాబు మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సులు నేర్చుకున్న వారు గ్రామీణ ప్రాంతాల్లో ఉత్పత్తి యూనిట్లు స్థాపించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలను అందిస్తున్నాయన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ప్రమోషనల్ ఆఫీసర్ వేణు మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు బ్యాంకుల నుంచి రుణాలు పొందడం, వివిధ ప్రభుత్వ శాఖల నుంచి అవసరమైన అనుమతులను తెలిపారు. జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ విద్యాకన్న మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసిన యువతకు చిన్న తరహా పరిశ్రమల స్థాపనపై అవగాహన లేకపోవడంతో ఇంటికే పరిమితం అవుతున్నారని, వారి కోసం సదస్సు ఏర్పాటు చేశామన్నారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ, సంస్థ సిబ్బంది, శిక్షణార్థులు పాల్గొన్నారు.

ప్రయాణికులను గమ్యానికి చేర్చడం డ్రైవర్ బాధ్యత

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆర్టీసీ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడం మనందరి బాధ్యతని విద్యాధరపురం ఆర్టీసీ డిపో మేనేజర్ కనకమేడల సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యాధరపురం డిపోలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యఅతిథి ట్రాఫిక్ సీఐ సుధాకర్ పాల్గొని ప్రమాద రహితంగా బస్‌లను నడిపే డ్రైవర్లకు నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ డ్రైవర్లు మొబైల్ ఫోన్లను మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని, మద్యం సేవించి బస్ నడపకూడదన్నారు. ఉత్తమ డ్రైవర్లను డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు అభినందించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్లు కె.ఆనంద్ బాబు, రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ కాలనీ బడ్డీకొట్లలో తనిఖీలు


కాలనీలో బడ్డీకొట్లలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జక్కంపూడి కాలనీ బడ్డీకొట్లలో పోలీసులు గురువారం తనిఖీలు చేశారు. సీఐ సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో కాలనీకి చేరుకున్న సెక్టార్ ఎస్ఐలు, ఏఎస్ఐలు, కానిస్టేబుల్స్ పలు బృందాలుగా కాలనీలో బ్లాకుల వద్ద వ్యాపారాలు సాగిస్తున్న బడ్డీకొట్లు, చిల్లర దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. కాలనీ శివారు ప్రాంతాల్లో ఎక్కువగా గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారంతో పోలీసులు తనిఖీలను చేపట్టారు. సిగరెట్ల కోసం బడ్డీకొట్ల వద్దకు వచ్చే యువకులు మహిళలను, యువతులను వేధిస్తున్నారనే ఫిర్యాదులొస్తున్నాయని, దీనిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాలనీలోని గ్రౌండ్స్‌లో స్థానికులతో సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐలు సమావేశమయ్యారు. యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చి, ఏదైనా ఘటన జరిగిన వెంటనే పోలీస్‌స్టేషన్, కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.







● ఉత్సాహంగా క్యాంప్‌ఫైర్

పాలిటెక్నిక్ గేమ్స్, స్పోర్ట్స్ విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉత్సాహంగా సాగుతున్నాయి. క్రీడా ప్రాంగణంలో గురువారం సాయంత్రం నిర్వహించిన క్యాంప్‌ఫైర్‌లో క్రీడాకారులు సందడి చేశారు. విద్యార్థులు నృత్యాలు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సినీ నటి జమున నటజీవితం ఆదర్శం


జమున చిత్రాల్లోని పాటలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

విజయవాడ కల్చరల్: సినీ నటి జమున నటజీవితం భావి నటీమణులు ఆదర్శంగా తీసుకోవాలని విశ్రాంత పోలీస్ అధికారి డేవిడ్ రాజు అన్నారు. తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గురువారం సినీ నటి జమున సంస్మరణ సభ, స్వరాంజలి కార్యక్రమాన్ని గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై నిర్వహించారు. డేవిడ్ రాజు మాట్లాడుతూ జమున సినీనటిగా, ప్రజాప్రతినిధిగాప్రతిభ చాటుకున్నారన్నారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాతూ ఆమె అగ్రనటులతో పోటాపోటీగా నటించారన్నారు. ఆమె రంగస్థల నటిగా నగరంలోని హనుమంతరాయ గ్రంథాలయంలో అనేక ప్రదర్శనలు ఇచ్చారని గుర్తు చేశారు. అతిథులు జమున చిత్ర పటానికి శ్రద్ధాంజలి ఘటించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన గాయనీమణులు దమయంతి, కస్తూరి అలివేణి, టి.శారద, కందర్ప రాధ, కొండలరావు, మోహన్‌రాజ్, శ్యామ్ ప్రసాద్ జమున నటించిన చిత్రాలలోని పాటలను ఆలపించారు.

సృజనాత్మకతతో సమస్యలకు చెక్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సమాజంలో ఎదురయ్యే సమస్యలను విద్యార్థులు సృజనాత్మకతతో పరిష్కరించాలని వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) ఫిజిక్స్ ప్రొఫెసర్ డి.హరినాథ్ చెప్పారు. సిద్ధార్థ కళాశాల ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యాన గురువారం సిద్ధార్థ ఆడిటోరియంలో సెన్షెల్లా–4.0 పేరుతో సాంకేతిక, సాంస్కృతిక అంశాల్లో విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుందని, ఇలాంటి వేదికల్లోనే బహిర్గతమవుతాయన్నారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, ప్రిన్సిపాల్ ఎం.రమేష్, డీన్ రాజేష్ సి.జంపాల, ఫిజిక్స్ విభాగాధిపతి టి.శ్రీనివాస కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

కళాశాల, పాఠశాల స్థాయి వేర్వేరుగా నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాల నమూనాల ప్రదర్శన (ఐస్), క్విజ్, రెప్లికా పోటీలతో పాటుగా రోల్ ప్లే పేరుతో విద్యార్థులు ప్రముఖ సైంటిస్ట్ వేషధారణలో అలరించారు. మధ్యాహ్నం నుంచి నృత్యాలు, సింగింగ్, ట్రెజర్‌హంట్, స్పాట్ ఫొటోగ్రఫీ, జస్ట్ ఏ మినిట్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వైభవంగా హనుమత్ వాహనోత్సవం


హనుమత్ వాహనంపై స్వామివారు


ఎదుర్కోలు ఉత్సవంలో ఉభయదేవేరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బ్రాహ్మణ వీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి హనుమత్ వాహనోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు పలు విశేష వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం కృష్ణానది నుంచి మంగళవాయిద్యాలతో పవిత్ర జలాన్ని తీసుకొచ్చి నిత్యార్చన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం దశావతార మంత్ర పారమాత్మిక హోమం చేశారు.

సందడిగా ఎదుర్కోలు ఉత్సవం

శ్రీవారి కంటే అమ్మవారే ఎక్కువ..కాదు.. అమ్మవారి కంటే అయ్యవారే ఎక్కువ... అంటూ పండితులు వాదించుకుంటూ ఎదుర్కోలు ఉత్సవాన్ని రక్తి కట్టించారు. శుక్రవారం సాయంత్రం వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం జరగనున్న క్రమంలో గురువారం రాత్రి ఆలయ ప్రాంగణంలో ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. ఆగమ పండితులు పొన్నంగిపల్లి శ్రీరామ చంద్రమూర్తి తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

హనుమత్ వాహనంపై ఊరేగిన శ్రీవారు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారు సాయంత్రం హనుమత్ వాహనంపై ఊరేగారు. మంగళవాయిద్యాలు, భజన బృందాలు, అర్చకులు వెంటరాగా స్వామి వారి వాహనోత్సవం ముందుకు సాగింది. కార్యక్రమాలను ఈఓ గెల్లి హరిగోపీనాథ్ బాబు పర్యవేక్షించారు.

తొలగనున్న ముంపు, మురుగు సమస్యలు

- మురుగునీటి శుద్ధి, వాన నీటి పారుదలపై వీఎంసీ ప్రత్యేక దృష్టి
- బుడమేరుకు వాన నీరు మళ్లి
- అసంపూర్తిగా ఉన్న స్టాంవాటర్ డ్రెన్ల నిర్మాణానికి రూ 9.5 కోట్లతో ప్రణాళిక
- రూ.30 కోట్లతో ఎస్టీపీల ఆధునీకరణ
- తాగునీటి సరఫరాకూ రూ. 21 కోట్లు


బుడమేరుకు వాన నీటిని మళ్లించడానికి ప్రణాళికలు

పటమట(విజయవాడతూర్పు): నగరంలో తాగునీరు, వర్షం నీరు మళ్లింపు, మురుగునీటి పారుదలకు వీఎంసీ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. రూ. 60.5 కోట్ల వ్యయ అంచనాతో ఆయా ప్రాంతాల్లో దీర్ఘకాలంగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించడానికి వీఎంసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. సర్కిల్–2 పరిధిలో బుడమేరుకు డైవర్షన్ చేయాల్సిన స్టాం వాటర్ డ్రెన్ నిర్మాణానికి, ముంపు సమస్యల తొలగించడానికి, తాగునీటి సరఫరా మెరుగు పరచడానికి ప్రణాళికలు రూపొందించారు

బుడమేరుకు వర్షం నీరు

సెంట్రల్‌లోని 1వ డివిజన్ కార్మెల్‌నగర్, షిర్డీసాయినగర్, 63వ డివిజన్‌లోని రాజీవ్‌నగర్, రాధానగర్, పాయకాపురం, 64వ డివిజన్‌లోని కండ్రిక ప్రాంతాల్లో ఎల్అండ్‌టీ చేపట్టిన స్ట్రాం వాటర్ డ్రెన్ పనులు అసంపూర్తిగా మిగిలాయి. స్థానికంగా ఉన్న ముంపు సమస్యను ఈ ప్రాంతవాసులు ఎమ్మెల్యే విష్ణు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. వర్షపునీటి మళ్లింపుకు డ్రెన్లు నిర్మించాలని వీఎంసీకి ప్రతిపాదన చేశారు. రూ.9.5 కోట్లతో అసంపూర్తిగా మిగిలిన స్ట్రాం వాటర్ డ్రెన్ పనులు చేయనున్నారు.

ఇవీ చేయనున్నారు

- 1వ డివిజన్ గుణదల రైల్వేగేటు వద్ద బాక్స్ కల్వర్టు నిర్మాణానికి రూ. 81.45 లక్షలు, కార్మెల్‌నగర్ షిర్డీసాయినగర్ వద్ద కల్వర్టులు, ఆర్‌సీసీ డ్రైయిన్ నిర్మాణానికి 2.44 కోట్లు,
- 61వ డివిజన్‌ఓ పాయకాపురం చెరువు నుంచి డిస్నీల్యాండ్ వరకు అవుట్‌ఫాల్ డ్రైయిన్ నిర్మాణానికి రూ. 55.86 నిధులు ఖర్చు చేయనున్నారు.
- 63వ డివిజన్‌లోని రాజీవ్‌నగర్ కట్ట వద్ద స్ట్రామ్ వాటర్ డ్రైయిన్ నిర్మాణానికి రూ. 3.17 కోట్లు
- 63, 64 డివిజన్‌లో రాధానగర్, కండ్రిక వద్ద కల్వర్టులు, ఆర్‌సీసీ డ్రైయిన్ నిర్మాణానికి రూ. 2.55 కోట్లు ఖర్చు చేయనున్నారు.

మురుగునీటి పారుదలకు

కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.63 కోట్ల నిధులు కేటాయించింది. ఇందులో రూ.51 కోట్లు తాగునీటిసరఫరా, మురుగునీటి పారుదలకు అధికారులు వెచ్చించనున్నారు.

ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు

శివారు ప్రాంతాలను వరదనీటి సమస్య తీవ్రంగా వేధిస్తుందని పలు ఫిర్యాదుల మేరకు స్థానికంగా స్ట్రాంవాటర్ డ్రెన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇది పూర్తయితే దేవీనగర్ కట్టరోడ్డు, వడ్డెరకాలనీ, ఎస్ఎస్‌సీ బోస్‌నగర్, కండ్రిక నుంచి బుడమేరులో కలుస్తాయి.

– ప్రభాకర్, సీఈ, వీఎంసీ

తాగునీటి సరఫరాకు

తాగునీటి ఎద్దడి నివారించడానికి ఎలివేటెడ్ సర్వీస్ రిజర్వాయర్(ఈఎల్ఎస్ఆర్), గ్రౌండ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్(జీఎస్ఎల్ఆర్) నిర్మాణాలకు, ఇన్‌టెక్ వెల్ నిర్మాణానికి రూ. నూతన పైపులైన్ల ఏర్పాటుకు, పంపుసెట్ల బిగింపుకు రూ.21 కోట్లు ఖర్చు చేయనున్నారు.

అమితానందమనిపింఛెన్


తెల్లవారుజామునే పింఛన్లు అందుకున్న అవ్వతాతలు అమితానందపడ్డారు. స్థానిక 49వ డివిజన్ ప్రైజర్‌పేటలోని 167వ సచివాలయం పరిధిలో గురువారం దివ్యాంగురాలైన రామిశెట్టి దుర్గమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పవన్

-సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

విద్యార్థులకు అభినందన

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కేబీఎస్ కళాశాల ఆవరణలో నిర్వహించిన బాలోత్సవ్‌లో తమ విద్యార్థులు వివిధ పోటీల్లో బహుమతులు పొందారని రెజోనెన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ బండ్ల మాధవరావు చెప్పారు. స్థానిక ప్రజాశక్తినగర్‌లోని స్కూల్ ఆవరణలో గురువారం బహుమతులు పొందిన విద్యార్థులను అభినందించారు.

- అమరావతి బాలోత్సవ్‌లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి పలు విభాగాల్లో బహుమతులు పొందారని వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను గురువారం స్కూల్ ఆవరణలో స్కూల్ ఉపాధ్యాయులు అభినందించారు. తమ విద్యార్థులు నాలుగు ప్రథమ, 10 ద్వితీయ, 21 తృతీయ బహుమతులను సొంతం చేసుకున్నారని చెప్పారు.

ఆకట్టుకున్న స్టార్ ఇన్నోవేటర్స్



గుణదల(విజయవాడతూర్పు): విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని సెయింట్ జాన్స్ విద్యా సంస్థల కరెస్పాండెంట్ టి.సుమన్ త్యాగరాజ్ ఆకాంక్షించారు. గుణదల సెయింట్ జాన్స్ ప్రీ ప్రైమరీ పాఠశాలలో గురువారం స్టార్ ఇన్నోవేటర్స్ పేరిట వైజ్ఞానిక ప్రదర్శన గురువారం ఏర్పాటు చేశారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దడంలో గురువులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. పర్యావరణ పరిరక్షణ, ట్రీ ప్లాంటేషన్, కంప్యూటర్ అంశాలను ప్రదర్శించారు. వచ్చిరాని మాటలతో వారు ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్లను వివరించారు. కార్యక్రమంలో సెయింట్‌జాన్స్ విద్యాసంస్థల ప్రెసిడెంట్ మోనికా సుమన్, పాఠశాల ప్రిన్సిపాల్ రామభారతి, వైస్ ప్రిన్సిపాల్ తరుణ్, ఉపాధ్యాయులు, తలిదండ్రులు పాల్గొన్నారు.